కామెడీ కథ

# వినాయక(రావు)విజయం

"జాతకంలో శని ఛండాలుడయ్యాడో? లేక గురుడు గతి తప్పి వక్రించాడో.. అదీ కాక ఏ గ్రహానికి మతి తప్పిందో? ఆపైన ఏ యోగం భంగమైందోకానీ, ఖర్మ కాలిపోయి, కొంప కొల్లేరు చేసుకోవడం కోసమే తనీ ఆఫీసులో చేరాడు. ఇదంతా తను పూర్వజన్మలో చేసుకున్న పాపం వల్ల పట్టిన అవయోగం అయ్యుంటుంది..." పి.ఏ వినాయకరావు అలా అనుకోవడం ఆఫీస్‌కొచ్చాక అది లక్షోసారి.

అక్షరాలా లక్షన్నొకటోసారి కూడా అనుకుంటూంటే అతనికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఠక్కున 'టక్' పీకేసి మరీ చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకున్నాడు. ఇంతలో ఇంటర్‌కం మోగింది.

జి.యం అని అతనికి తెలుసు. అందుకే దిగ్గున కుర్చీలోంచి లేచాడు.

"వీడి మొహం ఈడ్చ. మొహం మండ. మొహం తగలెయ్య. వీడి అమ్మాకడుపు మాడ." మనసులో తిట్టుకుంటూనే జి.యం ఛాంబర్‌లోకి ప్రవేశించాడు.

"ఎస్సార్!" అన్నాడు చేతులు కట్టుకు నిలబడుతూ!

"మొహం ఏవిటీ? అదోలా వుంది?" ఏదో చెప్పబోతున్నవాడల్లా ఆగిపోయి మరీ అనుమానంగా అడిగాడు జి.యం.

'ఏడ్చాను సార్!' అంటే బావుండదు. "ఏంలేదు సార్" అన్నాడు ఆఖరికి.

"మనసులో ఏదో ఉన్నప్పుడే మొహం అదోలా ఉంటుందని నా అభిప్రాయం" అన్నాడు జి.యం ఇంకా అనుమానం తీరక.

'ఏడవలేకపోయావ్?' మరోసారి మనసులో తిట్టుకున్నాడు వినాయకరావు.

"ఇట్సాల్‌రైట్! ముందు ఈ పేపర్ చూడు" అంటూ ఫైల్లోంచి ఓ పేపర్ తీసి వినాయకరావు చేతిలో పెట్టాడు జి.యం.

ఆ పేపర్‌లోని మేటర్‌ని చూస్తూనే గతుక్కుమన్నాడు. అతని గుండె గుటుక్కుమంది.

"ఇ..ఇదేమిటి సార్?" కంగారుగా అడిగాడు.

"కనిపించట్లేదూ! 'డ' కింద 'ణ' ఒత్తు, దాని కింద 'ల' ఒత్తు, దాని పక్కన 'క' ఒత్తు, అంతట్నీ కలిపి 'ర'కారం.." తాపీగా చెప్పాడు.

"అదే సార్ అడుగుతున్నది. నాకు మళ్ళీ ఏవైనా చిక్కు ప్రశ్న ఇవ్వబోతున్నారా అని!" భయంగా అడిగాడు వినాయకరావు.

"..బోతున్నారా? ఏవిటి.. ఇచ్చేశాను. ఇప్పుడు నువ్వీ అక్షరాన్ని ఎలా పలకాలో నాకు చెబుతున్నావన్నమాట!" నవ్వుతూ అన్నాడు జి.యం.

ఆ నవ్వు చూస్తుంటే వినాయకరావుకి ఒళ్ళు మండిపోయింది. కాగితం మీదున్న అక్షరాన్ని చూస్తుంటే ఏడుపూ వచ్చింది. అసలు మామూలుగా చాలామంది 'ళ', 'ణ' లాంటి అక్షరాలే పలకలేకపోతున్నారు. అలాంటిది ఒకటికి రెండు, రెండుకి మూడు అన్నట్టుగా ఇలా ఒత్తుల మీద ఒత్తులున్న ఆ విచిత్రాక్షరాన్ని ఎలా పలకాలో అర్థం కాలేదతనికి.

అసలిలాంటి అక్షరం తెలుగులోకానీ సంస్కృతంలోకానీ ఉందో? లేదో?

అలాంటి అక్షరాన్ని వెతికి తెచ్చి తనకిచ్చి ఎలా పలకాలో చెప్పమంటున్న జి.యం.ని చూస్తుంటే అమాంతం మీదపడి అతని పీక పిసికి చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది వినాయకరావుకి. కానీ తమాయించుకున్నాడు.

"ఎంతసేపట్లో చెప్పగలవ్?" అడిగాడు జి.యం వినాయకరావు వైపు ఎగాదిగా చూస్తూ.

"సాయంత్రం ఆఫీస్ వర్కింగ్ అవర్స్ అయిపోయేలోపు చెప్పడానికి ప్రయత్నిస్తాను సార్!" అన్నాడు.

"అయితే నేను సాయంత్రం వరకూ వెయిట్ చెయ్యాలన్నమాట. సరే.. ఇక నువ్వెళ్ళొచ్చు" అన్నాడు.

'వెయిట్ చెయ్యలేకపోతే గంగలో దూకు. అంట్లవెధవా!' తిట్టుకుంటూ బయటికి వచ్చేశాడు వినాయకరావు.

జి.యం ఛాంబర్‌లోంచి హుటాహుటిన వెళ్ళి టాయిలెట్‌లో దూరి తలుపేసుకున్నాడు. వేసివేసుకోగానే భోరుమంటూ పొగిలి పొగిలి సౌండ్ బయటకి రాకుండా ఏడ్చాడు. ఏడ్చీ ఏడ్చీ గుండె బరువు తగ్గాకా- అప్పుడు శుభ్రంగా మొహం కడుక్కుని చొక్కాతో తుడుచుకుని మరీ బయటికి ఒచ్చాడు. జి.యం రాసిచ్చిన అక్షరం వున్న పేపర్‌ని ఎదురుగా పెట్టుకుని దాన్ని పలకడానికి ప్రయత్నించడంలో బిజీ అయిపోయాడు.

సరిగ్గా.. అలా ప్రయత్నిస్తున్నప్పుడే అతని మనసు.. ఐదేళ్ళ క్రితం జి.యం తనని ఇంటర్వ్యూ చేసిన రోజు దగ్గరకి వెళ్ళి ఆగింది. ఆరోజు...

★ ★ ★

దడదడలాడుతున్న గుండెని చిక్కబట్టుకుని చేతిలో వున్న ఫైల్‌ని మరింత గట్టిగా పట్టుకుని స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని లోపలికి వెళ్ళాడు వినాయకరావు. వెళ్ళీ వెళ్ళగానే ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి తెల్లమొహం వేశాడు.

లోపల పి.ఏ పోస్ట్ కోసం వచ్చిన తనని ఇంటర్వ్యూ చెయ్యడానికి నలుగురో ఐదుగురో, అథమపక్షం ముగ్గురు ఆఫీసర్లయినా వుంటారని ఊహించాడు కానీ, అక్కడ లింగులింగుమంటూ ఒకే ఒక్కడుండగలడని అస్సలూహించలేదు. అటుపైన తెల్లటిసూట్‌లో, నున్నటి బట్టతలతో ఉన్న ఒంటికాయ్ సొంటికొమ్ముగాడు కంపెనీ మేనేజ్మెంట్ తాలూకు ఏకో, మేకో అంతకంటే తెలీలేదు. ఏం తెలిసినా ఏం తెలియకపోయినా అవతలున్నవాడు తన జాతకాన్నీ జీవితాన్నీ నిర్ణయించేవాడు గనక మర్యాదగా విష్ చేశాడు.

ముందు తనని చూసి నోరావలించి, ఆ తర్వాత తీరిగ్గా గుడ్ మార్నింగ్ చెప్పిన వినాయకరావుని ఎగాదిగా చూశాడే తప్ప 'ప్లీజ్ సిడౌన్. టేక్ యువర్ సీట్' లాంటి పొరపాటు ముక్కలేవీ సదరు ఒంటెత్తు రామలింగడు అన్లేదు.

"నీ పేరేమిటీ?" అడిగాడు.

"వినాయకరావు" వినయంగా చెప్పాడు.

"మరి తొండం లేదేం?" హూంకరించాడు.

ఆ హూంకరింపుకి వినాయకరావు హడలిపోయాడు. ఆ కంగార్లో మనిషికి 'తోకలూ తొండాలూ ఎందుకుంటాయి సార్?' అనడగాల్సింది పోయి, "ఇంటి దగ్గరుండిపోయింది సార్!" అనేశాడు.

ఆ వెంటనే ఇంటర్వ్యూ చేస్తున్నాయన 'హు' అంటూ హూంకరించాడింకోసారి.

"కోడి ముందా? గుడ్డు ముందా?" ప్రశ్నించాడు వెంటనే.


తెల్లబోయాడు వినాయకరావు. మళ్ళీ అంతలోనే సర్దుకున్నాడు. తలతిక్క ప్రశ్నలూ తలాతోకా లేని ప్రశ్నలూ అడిగి విసిగించే తతంగాన్నే

ఇంటర్వ్యూ అంటారు. తను ఇంటర్వ్యూకొచ్చి ఇలాంటి విషయాల్లో ఫీలవడం అనవసరం అనుకున్నాడు. అప్పుడు, క్షణం ఆలోచించి చెప్పాడు.

''పుట్టురీత్యా అయితే కోడి పెట్టిన గుడ్డుని ముందు తినేస్తారు సార్! ఆ తర్వాత గుడ్లు పెట్టని కోడిని తింటారు సార్. ఆ విధంగా గుడ్డు ముందూ, కోడి తర్వాతా సార్!''

''మనిషి తలలో ఎన్ని వెంట్రుకలుంటాయ్?!''

''శతకోటి మాసిన తలలకి అనంతకోటి వెంట్రుకలుంటాయి సార్. అలాగే సవా లక్ష బోల్డు హెడ్డులకి ఒక్క వెంట్రుక కూడా లేకపోవచ్చు సార్. ఎన్నని చెప్పేది? కాదూ! కూడదూ.. చెప్పమంటే, మీరో మనిషి తలని తెప్పించండి సార్! మీ ఎదురుగానే నేను దాంట్లోని వెంట్రుకల్ని లెక్కపెడతాను'' సిన్సియర్‌గా చెప్పాడు.



ఆ సమాధానం విని, అడిగినాయ గాఢంగా నిట్టూర్చాడు. అక్కడితో ఇంటర్వ్యూ అయిపోయిందనే అనుకున్నాడు వినాయక వు. కానీ అతని అంచనాలు తారుమారయ్యాయి.

సీట్లో కూర్చున్న ఒంటి పుల్లి కాసిగాడు ఇంటర్వ్యూలో అడగాల్సిన ప్రశ్నలిం చాలానే ఉన్నాయన్నట్టుగా ఇంకో ప్రశ్న వేశాడు.

''ఈ గుడ్డు పెట్టబడదు. పొదగబ దు. ఎవరి చేతా ఏ వంటకాల్లోనూ వాడబడదు కానీ సర్వ కాల సర్వావస్థల్లోనూ అందరిచేతా ఉ యోగించబడుతూనే ఉంటుంది. ఏవిటా గుడ్డు''

''గాడిద గుడ్డు..'' ఒళ్ళు మం పోతూంటే విసురుగా చెప్పాడు వినాయకరావు.

''కరెక్ట్.. ఇంకో ప్రశ్న.. ప్రపంచం కెల్లా అతి కష్టమైన పనేంటి?'' అడిగాడు.

''మీ దగ్గర ఉద్యోగం చెయ్యడం'' ఠక్కున చెప్పాడు.

అంతే! ఠప్పున అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఒకటి తీసి వినాయకరావు మొహాన కొట్టి ''యు ఆర్ సెలెక్టెడ్'' అన్నాడతను. అప్పుడు తెలిసింది. అతగాడు ఆ కంపెనీ ఎం.డి కొడుకూ, ఆపైన ఆ కంపెనీకి జి.యం కూడా అని.

ఎంత తలతిక్కగా సమాధానాలు చెప్పినా అవేవీ పట్టించుకోకుండా తనని సెలెక్ట్ చేసి పారేసిన జి.యం వైపు నీళ్ళునిండిన కళ్ళతో కృతజ్ఞతగా చూసి వెళ్ళి పి.ఎ.గా తన సీట్లో కూర్చున్నాడు వినాయకరావు. కానీ.. అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుంటున్న క్షణంలో తన కళ్ళలో అప్రయత్నంగా ఊరిన ఆనందభాష్పాలు ఇకనుంచీ ప్రతీక్షణం తన కళ్ళలో దుఃఖాశ్రువులుగా ఊరుతూనే ఉంటాయని ఆ క్షణంలో పాపం వినాయకరావు ఊహించలేదు!

ఆ మర్నాడు.. వినాయకరావు ఆఫీస్‌లో అడుగు పెట్టీ పెట్టగానే జి.యం పిలుపు. అర్జంటుగా రమ్మని. తనేమో పి.ఏ కదా! అంచేత ఏం రాచకార్యాలు మునిగిపోతున్నాయో అనుకుంటూ పరుగెత్తుకెళ్ళాడు. ఆఘమేఘాల మీద ఆయాసపడిపోతూ వచ్చిన అతన్ని చూసి దిగ్గున కుర్చీలోంచి లేచి పరుగెత్తుకుంటూ అతనికి ఎదురెళ్ళాడు జి.యం.

''బోడోడు ఎవడురా? బొచ్చోడు ఎవడురా? మొలచుట్టూ కత్తులున్న వాడి పేరు ఏదిరా?'' పాట పాడుతూ సంక్రాంతి రోజుల్లో ఆడపిల్లలు తప్పట్లు కొట్టుకుంటూ గొబ్బెమ్మల చుట్టూ తిరిగినట్టుగా.. నిట్రాటంగా బిగుసుకుపోయిన వినాయకరావు చుట్టూ తిరగడం మొదలెట్టాడు.

జరుగుతున్నదేవిటో ఒక్కక్షణం అతనికి అర్థం కాలేదు. అర్థమయ్యాకా ''సార్!'' అంటూ ఆందోళనగా ఓ గావుకేక పెట్టాడు.

ఠక్కున ఆగిపోయాడు జి.యం.

''ఎస్.. సార్‌నే.. కనుకనే అడుగుతున్నాను. ఇప్పుడు నేను పాడిన పాటలో బోడోడు, బొచ్చోడు, మొలచుట్టూ కత్తులున్నవాడూ ఎవరో చెప్పుకో చూద్దాం'' అన్నాడు.

నవ్వు రాకపోయినా బలవంతంగా నవ్వాడు వినాయకరావు.

అగస్త్యప్రగడ హేమంత

''వాళ్ళెవరో ఏవిటో నాకెలా తెలుస్తుంది సార్?'' మొహమాటంగా అన్నాడు.

అతని మాటలు పూర్తిగా పూర్తికాకుండానే చటుక్కున రివాల్వర్ తీసి గబుక్కున వినాయక రావు గుండెకి గురి పెట్టాడు జి.యం.

''నా రివాల్వర్‌కి లైసెన్సుంది. ఇప్పుడు నేనడిగిన ప్రశ్నలకి సమాధానాలూ ఉన్నాయ్. కనుక నేనడిగినదానికి అడిగినట్టుగా జవాబులు చెప్పకపోయావంటే ఛస్తావ్! ఆ తర్వాత... నువ్వు నన్ను హత్య చెయ్యబోతే ఆత్మరక్షణార్థం నేనే నిన్ను చంపేశానని ఎలిబీలూ, ఎవిడెన్స్‌లూ సృష్టించుకోవడం నాకు పెద్దంత కష్టం కాదు. అదన్నమాట సంగతి! ఇప్పుడు చెప్పు.. ఆలోచించి సమాధానం చెప్తావా? సమాధానం చెప్పక ఛస్తావా?'' అడిగాడు.

వినాయకరావుకి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. ఇంటర్వ్యూలో ఏవో నాలుగు తల తిక్క ప్రశ్నలడిగేసరికి అదో సరదా అని సరిపెట్టుకున్నాడు. తానిచ్చిన తలతిక్క సమాధానాలకే తనకి ఉద్యోగమిస్తే అదంతా దయార్ద్ర హృదయమూ ఉదారతా అనుకున్నాడు. కానీ అసలివన్నీ కాక ఇదో వేలం వెర్రి అని కనిపెట్టలేకపోయినందుకు తనని తనే తిట్టుకున్నాడు.

''ఇదెక్కడి తలతిక్క మేళంరా భగవంతుడా అంతా తన చావుకొచ్చి పడింది'' మనసులో ఘొల్లుమన్నాడు. ఇక గత్యంతరం లేకపోవడంతో ''సరే సార్! వర్కింగ్ అవర్స్ అయిపోయేలోపు చెప్తాను'' అన్నాడు.

''అద్గదీ! అలా అన్నావు బావుంది. ఇక వెళ్ళు'' రివాల్వర్‌ని డ్రా, సొరుగులో పెట్టే నవ్వుతూ అన్నాడు జి.యం.

బతుకు జీవుడా అనుకుంటూ రెండంగల్లో ఇవతలపడ్డాడు వినాయకరావు. చెమటలు తుడుచుకుంటుంటే ఆ క్షణంలో అతనికి ఒకటే అనిపించింది.

'ఈ పి.ఏ ఉద్యోగమూ వద్దు. ఏడువేల జీతమూ వద్దు. బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు..' అని! వెంటనే కాళ్లకి బుద్ధి చెబుదామనుకుంటూండగానే మళ్లీ జి.యం పిలుపు.

వణుకుతున్న కాళ్లని బలవంతాన అదుపులో పెట్టుకుని వెళ్లి జి.యం.కి ఎదురుగా నిలబడ్డాడు వినాయకరావు.

''చూడూ! నేనడిగిన ప్రశ్నలకి సమాధానాలు తెలియక పారిపోయావనుకో.. ఈ భూప్రపంచంలో నువ్వు ఎక్కడున్నాసరే నిన్ను వెతికి పట్టుకుని మరీ పిట్టని కాల్చినట్టు కాల్చిపారేస్తాను జాగ్రత్త!'' అన్నాడు.

మిగిలిన ఒక్కదారి కూడా మూసుకుపోవడంతో వినాయకరావు నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఆ ధాటికి తట్టుకోలేక హుటాహుటిన వెళ్లి టాయిలెట్స్‌లో దూరి కరువుతీరా ఏడ్చేశాడు. ప్రతిరోజూ అతను జి.యం ఛాంబర్‌లోంచి బయటపడి సరాసరి టాయిలెట్స్ వైపు పరుగు తియ్యడానికి నాంది అదే!

ఏడవడం పూర్తయ్యాక తన సీట్లోకొచ్చి కూర్చున్నాడు వినాయకరావు. ఆలోచించాడు. ఆలోచించాడు. సాయంత్రం నాలుగున్నర వరకూ అతనికి ''బోడోడు, బొచ్చోడు, మొలచుట్టూ కత్తులున్న అంట్ల వెధవలెవరో తట్టనేలేదు. ఇక తనకి చావు ఖాయమని నిశ్చయించేసుకున్నాడు. గుండె దిటవు చేసుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు. చచ్చిపోయిన తన పూర్వీకులందర్నీ తల్చుకున్నాడు. అలా తల్చుకుంటున్నప్పుడే అతనికి తన అమ్మమ్మ- కనకరత్నమ్మ గుర్తొచ్చింది. ఆవిడ తననెంత గారం చేసిందీ, కళ్లముందు కదిలింది. ఆవిడ పోయే క్షణం వరకూ కూడా ఆపకుండా చెప్పిన కబుర్లూ గుర్తొచ్చాయి.

అదుగో.. సరిగ్గా అప్పుడే.. జి.యం ప్రశ్నలన్నిటికీ టకటకా సమాధానాలు దొరికేశాయి.

''బోడోడు వెలక్కాయ్.. బొచ్చోడు కొబ్బరికాయ్.. మొలచుట్టూ కత్తులున్న వాడి పేరు వం..కాయ్!'' ప్రాణాలు దక్కాయన్న సంతోషంలో సర్వం మరచి, తన టేబుల్ చుట్టూ తప్పట్లు కొట్టుకుంటూ తిరుగుతున్న వినాయకరావుని స్టాఫంతా వింతగా చూశారు. అందరితో బాటూ జి.యం కూడా చూశాడు. ఆ విధంగా అప్పటికి అతను గండం నుంచి గట్టెక్కిపోయాడు.

మళ్లీ మర్నాడు...

''చుట్ట కాల్చేవాడు సూర్యుడి కొడుకు. సిగరెట్ కాల్చేవాడు చంద్రుడి కొడుకు. బీడీ కాల్చేవాడు భీముడి కొడుకు. ఏమీ కాల్చనివాడు ఎవడి కొడుకు?'' అంటూ పాట పాడాడు జి.యం.

''నీలాంటి.. వెధవ గాడిద కొడుకు'' ఒళ్లు మండిపోగా కసిగా అన్నాడు వినాయకరావు.




అనేటప్పుడు కూడా ఆ ముందుమాటని మనసులోనూ, వెనక మాటని పైకీ అన్నాడన్నమాట!

''వెరీగుడ్!'' అంటూ గుడ్లు మిటకరించాడు జి.యం.

ఆ విధంగా రోజుకో గండం దాటుకుంటూ ఐదేళ్లనుంచీ ఉద్యోగం చెయ్యలేకా, మానేసి వెళ్లిపోలేకా ఈ పోస్టుని ఏడుస్తూ నిర్వహిస్తున్నాడు వినాయకరావు.

గడియారం ఠంగున ఐదు కొట్టేసరికి ఆలోచనల్లోంచి బయటపడ్డాడు వినాయకరావు. ఎదురుగా టేబుల్ మీదున్న పేపరందుకుని జి.యం ఛాంబర్‌లోకి నడిచాడు.

''సమాధానం దొరికిందా?'' అడిగాడు జి.యం.

'దొరక్క ఛస్తుందా?' మనసులోనే అనుకున్నాడు వినాయకరావు.

''దొరికింది సార్!'' అంటూ చెప్పబోయేలోపు జి.యం టేబుల్ మీదున్న ఫోన్ గొంతు చించుకుంది. కానీ జి.యం ఎత్తలేదు. కనీసం దాని వైపు కన్నెత్తయినా చూడలేదు.

''అదలా పీక తెగిన మేకలా అరుస్తోంది సార్. ముందు దాని సంగతి చూడండి'' కించిత్ అసహనంగా అన్నాడు వినాయకరావు. అదే అతను చేసిన పొరపాటు... ఆ పొరపాటుని చటుక్కున పట్టుకున్నాడు జి.యం. ఠక్కున రిసీవర్ తీసి పక్కన పెట్టేశాడు.

''బుద్ధుందిటయ్యా నీకు? పీక తెగింతర్వాత ఇక మేక అరిచేదేవిటి? గిలగిల తన్నుకుని చచ్చూరుకోవడం తప్ప. ఇలాంటి ఉపమానాలు చెప్పేటప్పుడు చెవి కోసిన మేకలా అనో, రెక్కతెగిన పక్షిలా అనో, వాడాలి తప్ప, 'పీక తెగిన' అనడం తప్పు! గ్రమిటికల్ మిస్టేకది...'' ఓ అరగంట క్లాసు దంచాక అప్పుడు ''సరే! ఇంతకీ ఆ అక్షరాన్ని ఎలా పలకాలన్నావ్?'' అడిగాడు.

''డ,ణ,ల,క,ర..ఇంతే!'' చెప్పాడు.

''ఈ కాస్త ముక్క చెప్పడానికి ఇంతసేపు ఆలోచించాలా? పొద్దున్నే చెప్పొచ్చుగా. సరే.. ఇంక నువ్వెళ్లొచ్చు'' అన్నాడు.

''ఏడవలేకపోయావ్! అసలు నీ రివాల్వర్‌కి భయపడి కానీ లేకపోతే నువ్వడిగే తలతిక్క చచ్చు ప్రశ్నలకి ఏ తలమాసిన వెధవా సమాధానాలివ్వడు.'' మనసులో అనుకుంటూ వెనుదిరిగాడు వినాయకరావు.

సరిగ్గా అప్పుడే. జి.యం జేబులో ఉన్న 'సెల్‌ఫోన్' కుయ్యో కుయ్యోమంది. అవతల ఎవరున్నారో. వాళ్ళు ఏం మాట్లాడారో తెలీదుగానీ ఆ

మాటల్ని వింటున్న జి.యం మొహం మాత్రం మాడిపోయిన పెనంలా అయిపోయింది.

''వి..నా..య..క్..రా..వ్..'' ఓ గావుకేక పెట్టాడు జి.యం.

అదిరిపడి గిర్రున వెనక్కి తిరిగి ''సార్!'' అన్నాడు.

''ఏమైంది సార్!'' అడగచ్చో అడగ కూడదో అనుకుంటూనే అడిగాడు.

''మన కంపెనీకి దక్కాల్సిన ఫారిన్ ప్రాజెక్టొకటి లాస్ట్ మినిట్‌లో చెయ్యిజారిపోయేలా ఉందిట'' ఆందోళనగా అన్నాడు జి.యం.

''పోనీ మీరు బయల్దేరి వెళ్ళండి సార్ ప్రయోజనం ఉంటుందేమో!'' ఒక పి.ఏ. సలహా ఇచ్చాడు వినాయకరావు.

''అక్కడ రంగంలో మా నాన్నున్నాడు. నా అంతటివాణ్ణి కన్నవాడు ఆయనే ఏదీ చెయ్యలేకపోతున్నాడు. ఇక నేవెళ్ళి ఏం వెలగబెడతాను? ఒకటా రెండా? మూడు కోట్ల ప్రాజెక్ట్. ఇది చెయ్యిజారిపోతే నేనూ నా కంపెనీ నెత్తిన ముసుగేసుకోవాలి. ఎలా? ఏం చెయ్యాలి? అదలా పోకుండా ఉండాలంటే ఏదైనా మిరకిల్ జరగాలి. జరిగి తీరాలి..'' ఆరాటంగానూ.. చెప్పలేనంత ఆందోళనగానూ అన్నాడు జి.యం.

జి.యం మొహంలో అలాంటి ఫీలింగ్స్ చూడ్డం వినాయకరావుకి అదే ప్రథమం. ఎప్పుడూ కోడిగుడ్డుకి ఈకలెందుకుండవూ? గాడిదగుడ్డుతో ఎన్ని ఆమ్లెట్లు వెయ్యచ్చు? ఎద్దుపాలల్లో ఏ ఏ విటమిన్లుంటాయి? కోడిపుంజు ఎన్ని రోజులకి ఒక గుడ్డు పెడుతుంది? లాంటి పిచ్చి ప్రశ్నలూ తల తిక్క ప్రశ్నలూ వేసే జి.యం.లో వాడిజాన్నే చూశాడు తప్ప, ఇలా కంపెనీ కోసం పడే ఆరాటాన్నీ తాపత్రయాన్నీ చూడలేదు. [illegible] ఆ పరిస్థితి అతనికి వింతగానూ విచిత్రంగానూ కూడా అనిపిస్తోంది.

వినాయకరావు ఇలాంటి ఆలోచనల్లో పడగానే, జి.యం చటుక్కున రివాల్వర్ తీసి గబుక్కున వినాయకరావుకి గురిపెట్టాడు.

''ఇప్పుడు ఆ ఫారిన్ ప్రాజెక్ట్ ఎలో అయినా నా కంపెనీకి వచ్చేలాంటి ఉపాయం ఏదయినా చెబుతావా? లేక నా చేతిలో చస్తావా?'' అడిగాడు.

వినాయకరావుకి పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. చచ్చి స్వర్గానికెళ్ళిన పెద్దలందరూ వర్సగా కనిపించారు.

''అంతర్వేది నరసన్నా.. అప్పన పల్లి వెంకన్నా.. అయినవిల్లి వినాయకా..'' దేవుళ్ళందర్నీ వర్సగా తల్చుకుంటున్న వినాయకరావు ఆలోచనలు హఠాత్తుగా ఆగిపోయాయి.

''ఎస్. అయినవిల్లి వినాయకుడు..'' మనసులోనే అనుకుంటూ తక్కున కళ్ళు తెరిచాడు.

''చావను సార్..చెప్తాను'' చప్పున అన్నాడు.

''చెప్పు తొందరగా..'' జి.యం రివాల్వర్‌ని దించకుండానే అడిగాడు.

''అయినవిల్లి గుడికెళ్ళి స్వామివార్ని దర్శించుకుని గుళ్ళో ఐదు వందల ఎనిమిది గుంజీలు తీస్తానని వినాయకుడికి మొక్కుకోండి సార్! ఆ ప్రాజెక్ట్ మన కంపెనీకే వస్తుంది'' అన్నాడు.

''నిజంగానా?'' అపనమ్మకంగా అడిగాడు.


''అవున్సార్! అసలు ఆయనకి మొక్కుకున్నాకే నేను మా అమ్మ కడుపున పడ్డాన్ట సార్! మా బామ్మ చెబుతుండేది. కావాలంటే ఇప్పుడు స్వామివారికి దణ్ణం పెట్టుకోండి. అరగంటలో ఆ ఆర్డర్ మనకే వచ్చిందని మీకు ఫోనొస్తుంది'' నిబ్బరంగా అన్నాడు.

లోలోపల మాత్రం అతనికీ భయంగానే వుంది. యధాలాపంగా తను చీకట్లోకి విసిరిన బాణాలు గురి తప్పితే ఇక తన పని అంతే సంగతులని. జి.యం.కి సలహా ఇచ్చిన ఆ చేత్తోనే తనూ అయినవిల్లి వినాయకుడికి మొక్కేశాడు..'' ఈ గండం నుంచి గట్టెక్కించి నన్నీ రాక్షసుడి బారి నుంచి కాపాడితే నీ దర్శనానికి వస్తాను..'' అని!

వినాయకరావు మొరని అయినవిల్లి వినాయకుడు ఆలకించినట్టే ఉన్నాడు. అరగంట తర్వాత ఫోను.. పోతుందనుకున్న ఫారిన్ ప్రాజెక్ట్ కాస్తా తమ చేతికే వచ్చిందని! అయినవిల్లి వినాయకుడి మీద జి.యం.కే కాదు.. వినాయకరావుకి కూడా గురి కుదిరింది.

''ఎక్కడుంది అయినవిల్లి? ఎలా వెళ్ళాలి?'' సంతోషం ఆపుకోలేనట్టుగా వెంటనే అడిగాడు జి.యం.

ఐదు వందల ఎనిమిది గుంజీలు తియ్యడం కోసం అప్పుడే అతని మనసు ఉవ్విళ్ళూరుతోంది. కానీ..అసలు అదెంత రిస్కో ఆ క్షణంలో అతనికి ఊహకూడా అందని విషయం.




''అమలాపురం దగ్గరుంది సార్! కార్లో వెళ్ళిపోవచ్చు. రాత్రి బయల్దేరితే తెల్లారేసరికి అక్కడుంటాం'' అన్నాడు వినాయకరావు.

మర్నాడు తెల్లారేసరికి ఇద్దరూ అయినవిల్లి గుళ్ళో ఉన్నారు. మొక్కు ప్రకారం జి.యం గుంజీలు తీస్తుంటే, వినాయకరావు వినయంగా లెక్కపెట్టడం మొదలెట్టాడు. వంద గుంజీలు పూర్తయ్యేసరికి జి.యం.కి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. రెండో వంద పూర్తయ్యేసరికి కాళ్ళూ చేతులూ కూడా చల్లబడ్డాయ్. మూడో వందకి చేరుకునేసరికి గుంజీలు తియ్యడం అంత సులువు కాదేమో అనిపించింది. ఇక నాలుగో వంద కొచ్చేసరికి తనవల్ల కాదంటూ చేతులెత్తేశాడు జి.యం.

''అమ్మమ్మ.. అలా అంటే కుదర్దు. స్వామివారికి కోపం వస్తుంది. ఎలాగో కానీయండి'' అంటూ నచ్చచెప్పి ఆ మిగిలినవి కూడా పూర్తి చేయించాడు వినాయకరావు.

అసలే యాభైకి దగ్గర్లో పడుతున్న వయసు. ఆపై స్థూలకాయం. అటుపైన గుంజీల మహత్యం. వెరసి గుంజీల కార్యక్రమం పూర్తయ్యీ అవగానే మొదలు నరికిన చెట్టులా 'ఢా'మ్మంటూ కిందపడిపోయాడు జి.యం. ఎలాగో లేచినా, కండరాలు పట్టేయడం వల్ల రెండడుగులు వేసి వెయ్యగానే 'దబ్బు'న పడ్డాడు. ఆ విధంగా దబుకూ..దిబుకూలాడుతూనే వినాయకరావు ఆసరాతో వచ్చి కార్లో పడ్డాడు.

అటు తర్వాత... వెళ్ళి హాస్పటల్ బెడ్‌మీద కూడా పడ్డాడు. రెండు నెలలపాటు బెడ్‌రెస్ట్! ఆ దెబ్బతో జి.యం రిమ్మ తిరిగిపోయింది. తెలిసీగా తనచేత ఐదు వందల గుంజీలు తీయించి తద్వారా మోకాళ్ళు నెప్పెట్టేటట్టు చేసి రెండు నెలలపాటు తనని బెడ్‌మీద పడేసిన వినాయకరావు తెలివికి జి.యం తలగిర్రుమంది.

ఇక అటు తర్వాత అతను మళ్ళీ వినాయకరావు జోలికి రానూ లేదు, పిచ్చి ప్రశ్నలేసి రివాల్వర్ చూపి ఏడిపించనూ లేదు. ఆ విధంగా అయినవిల్లి గుళ్ళో గుంజీల ధర్మమాని వినాయకరావు కూడా ఒడ్డున పడ్డాడు.

''శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలున్నాయ్! అలాగే శతకోటి తల తిక్క రకాలకి బుద్ధి చెప్పడానికి అయినవిల్లీ ఉంది. ఆపైన ఐదొందల గుంజీలూ ఉన్నాయి. అంతా అయినవిల్లి వినాయకుడి దయ!'' అనుకున్నాడు వినాయకరావు.

**సూచన:-** గుంజీల విషయంలో ఎవరికైనా డౌట్లుంటే ఓ వంద గుంజీలు తీసి చూడవలెను.

*